క్లుప్తంగా

సూపరింటెండెంట్‌గా రమణ



కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా టీబీ వెంకటరమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాజానగరం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన నండూరి ప్రభాకర రామారావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

కొత్తపల్లి: గోర్సకు చెందిన కొప్పిశెట్టి నేరేళ ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందగా తన కుటుంబాన్ని మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో సర్పంచి రొంగల వీరబాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస ఎంపీపీ చెట్టుబత్తిని సురేష్‌కుమార్, వాసంశెట్టి అదినారాయణ, సతీష్ తదితరులు ఉన్నారు.

పాదగయ పుష్కరిణిలో సిల్టు తొలగింపు



పాదగయ పుష్కరిణిలో సిల్టు తొలగిస్తున్న సిబ్బంది

పిఠాపురం: స్థానిక కుక్కుటేశ్వరస్వామి వారి ఆలయంలో పాదగయ పుష్కరిణి ప్రక్షాళన పనులు ప్రారంభించారు. మహా శివరాత్రి ఉత్సవాలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పుష్కరిణి శుభ్రం చేస్తున్నారు. పెత్తను షిల్టు తొలగించే మిషన్‌తో తొలగిస్తున్నారు. గతంలో మహా శివరాత్రి ఉత్సవాలకు ముందు పుష్కరిణిలో నీటిని తొలగించి శుభ్రం చేసి కొత్త నీటిని నింపేవారు కాని ప్రస్తుతం మిషన్ సహాయంతో అడుగున పేరుకు పోతున్న పెత్తను తీసివేస్తున్నారు.

నేడు రామస్వామి ఆచార్యుల వర్ధంతి



ఎక్కిరాల రామస్వామి ఆచార్యులు (ఫైల్)

సామర్లకోట: ఆధ్యాత్మిక వేత్త ఎక్కిరాల రామస్వామి ఆచార్యుల వర్ధంతిని బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్టు ఆ కమిటీ నిర్వాహకులు పేకేటి చిరంజీవి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక నవగ్రహం అయోధ్యరామపురంలోని ధ్యాన మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో కమిటీ నాయకులు బీవీ రమణారావు, బొడ్డు అమ్మిరాజు, టి.అంజనీకుమార్, ఆరేటి శ్రీను, పేకేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగుపై అవగాహన



ఆధునిక సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏడీఆర్ సంచాలకులు భరతలక్ష్మి

పెద్దాపురం: రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచాలని ఏడీఆర్ సంచాలకులు భరతలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఏరువాక కో ఆర్డినేటర్ వెంకటనరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. రైతులకు నూతన విషయాలపై అవగాహన కల్పించడంతో పాటు మెరైన యాజమాన్య పద్ధతులను తెలియజేయాలన్నారు. వ్యవసాయాధికారులు ముకుందరావు, జ్యోతిర్మయి, రమణ, తదితరులు ఉన్నారు.

ఆపద మిత్రలకు కిట్లు పంపిణీ



ఆపద మిత్రలకు కిట్లు అందజేస్తున్న ఎంఎస్ఎన్ రెడ్డి

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఆపద మిత్ర శిక్షణ పూర్తి చేసుకున్న కోనసీమ, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలోని ఆరు బ్యాచ్‌ల ఆపద మిత్రలకు కిట్లు పంపిణీ చేశారు. ఈటీసీ ప్రిన్సిపాల్ అండ్ ఎస్టేట్ మేనేజర్ ఎంఎస్ఎన్ రెడ్డి కిట్లు అందజేశారు. కిట్లలో వాటర్ ప్రూఫ్ బ్యాగ్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, హెల్మెట్, వాటర్ ప్రూఫ్ కళ్లజోడు, లాంగ్ వయిజ్ బార్యర్ కమ్ చార్జింగ్ లైట్, లైఫ్ జాకెట్, వాటర్ ప్రూఫ్, స్పెషల్ లైన్ కోటు, కొవ్వొత్తులు, లైటర్, సేఫ్టీ సెట్, వాటర్ బాటిల్, స్పెషల్ బూట్లు, రేడియం రెడ్ జాకెట్ ఉంటాయని చెప్పారు.

శ్రీరస్తు.. శుభమస్తు.. కల్యాణమస్తు..!

- పెండ్లి కుమారుడైన కుంతీమాధవుడు
- పెండ్లి కుమార్తెలుగా రాజ్యలక్ష్మీదేవి, లక్ష్మీదేవి
- నేడు కుంతీమాధవస్వామి కల్యాణం

పిఠాపురం: దేవదేవుడి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పంచమాధవ క్షేత్రాలలో ఒకటైన పిఠాపురంలోని కుంతీమాధవ స్వామి వారి దివ్య కల్యాణం బుధవారం నిర్వహించనున్నారు. కల్యాణోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కాగా ధ్వజా రోహణం అనంతరం మంగళవారం ఉదయం చక్రపెరుమాళ్ల గ్రామోత్సవం, స్వామి వారి ఉత్సవమూర్తులకు అలంకార తిరుమంజనం కల్యాణాలంకారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంతీమాధవ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారు కల్యాణాలంకారంలో పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. బుధవారం రాత్రి 9 గంటలకు స్వామి వారి దివ్య కల్యాణం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. ఇదే ఆలయంలో వేంచేసి ఉన్న లక్ష్మీదేవి అమ్మవారికి కల్యాణ అలంకారం చేశారు. కల్యాణం ఎక్కువ మంది భక్తులు తిలకించేలా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వరదా శేషు తెలిపారు.



కుంతీ మాధవస్వామివారి తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

గుడికి చేరిన స్వామివారి ఆభరణాలు

పిఠాపురం: విశేష ఆభరణాలు అలంకారంలో కుంతీ మాధవ స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఏడాదికి ఒక సారి మాత్రమే అలంకరించే విశేష ఆభరణాలను అధికారులు లాఖరు నుంచి ఆలయానికి తీసుకువచ్చారు. కల్యాణ వేళ అత్యంత విలువైన వజ్ర వైడూర్యాలు మణి మాణిక్యాలతో కూడిన ఆభరణాల అలంకారంలో కుంతీ మాధవ స్వామి భక్తులకు దర్శనమిస్తారు. విలువ కట్టలేని అత్యంత ప్రాచీన కుంతీమాధవస్వామి ఆభరణాలను ఆలయంలో భద్రత లేక స్థానిక బ్యాంకు లాఖరులో ఉంచుతారు. ఏడాదికి ఒకసారి స్వామివారి కల్యాణోత్సవాల సమయంలో మాత్రమే భద్రత (సాయుధ పోలీసుల) నడుమ అధికారులు తీసుకువచ్చి కల్యాణోత్సవాల అనంతరం తిరిగి బ్యాంకులో భద్రపరుస్తారు. ఆలయంలో ఆభరణాలు ఉన్న అన్ని రోజులు సాయుధ పోలీసుల పహారాలో నిరంతర పర్యవేక్షణలో ఉంటాయి. మంగళవారం పిఠాపురం ఎస్‌బీఐ వైఐస్ కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సాయుధ బలగాల పహారా నడుమ సిబ్బందితో కలిసి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ సీహెచ్ రమణమూర్తి, దేవదాయ ధర్మదాయ శాఖ తనిఖీ అధికారి వి.వి.జేంద్రకుమార్ సమక్షంలో స్వామివారి దివ్యాభరణాలను బ్యాంకు లాకరు నుంచి తీసుకువచ్చారు. ఆభరణాలను లెక్క చూసి ఆలయ అర్చకులకు వాటిని అప్పగించారు. ఈనెల 6వ తేదీ వరకు స్వామి వారి అలంకారంలో ఉంటాయి. అవి ఉన్నన్ని రోజులు భద్రతా పహారా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ వరదా శేషు తదితరులున్నారు.



విశేష ఆభరణాల అలంకరణలో కుంతీ మాధవస్వామి వారు



బ్యాంకు లాకరు నుంచి తెచ్చిన ఆభరణాలను ఆలయ అర్చకులకు అప్పగిస్తున్న అధికారులు

పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురం మున్సిపల్ బడ్జెట్ సమావేశం

పిఠాపురం: పార్టీలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని దానికి అందరి సహకారం ఉండాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు కౌన్సిలర్లను కోరారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంజూరు చేసిన రూ.20 కోట్లతో ముఖ్యమైన పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈనిధుల్లో తొలుత జగ్గయ్య చెరువు కాలనీకి ఎక్కువ నిధులు కేటాయించడం వారిని మార్చి అన్ని ప్రాంతాలు అభివృద్ధి సాధించాలన్న ఉద్దేశ్యంతో ప్రతి వార్డుకు రూ.10 లక్షలు చొప్పున నిధులు కేటాయించనున్నట్టు ఆయన తెలిపారు. ఈసందర్భంగా మున్సిపల్ సిబ్బందికి ప్రజాప్రతినిధులంటే విలువ లేకుండా పోయిందని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు పట్టించుకోవడం లేదని పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. దీంతో శానిటరీ మేస్త్రి బాధ్యతాయుతంగా ఉండి ఆందోళన కారులను శాంతింపజేశారు. బడ్జెట్ సమావేశం అనంతరం విందు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ అధికారులు తెలపగా తామెవ్వరికి ఆ సమాచారం లేదని తాము భోజనాలు చేసేది లేదని కౌన్సిలర్లు చెప్పడంతో కమిషనర్ ఎం.రామ్మోహన్ కలగజేసుకుని సమయంలేక సమాచారం ఇవ్వలేక పోయామని నచ్చజెప్పడంతో కౌన్సిలర్లు అంగీకరించారు. అజెండాలో ప్రతిపాదించిన విషయాలపై చర్చ జరగగా పలువురు కౌన్సిలర్లు స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు. పారిశుద్ధ్య సమస్య పెరుగుతుండడం చీడిపైప్లు, డ్రైన్లు, రోడ్లు పట్టణంలో చాలా అధ్వానంగా ఉన్నాయని, వాటిని వెంటనే అభివృద్ధి చేయాలని సభ్యులు సమావేశంలో గళమెత్తారు. టీడీపీ మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో అన్ని సమస్యలపై తగిన చర్యలు చేపడుతున్నామని, ప్రణాళికలు కూడా తయారు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.25.73 కోట్ల మిగులుతో అంచనా బడ్జెట్‌ను సమావేశం ఆమోదం తెలిపింది. ప్రారంభ నిల్వ రూ.26.12 కోట్లు కాగా అన్ని చార్జీల ద్వారా రూ.40.20 కోట్ల ఆదాయం వస్తుందని మొత్తం ఆదాయం రూ.66.32 కోట్లుగా బడ్జెట్‌లో చూపించారు. వివిధ అభివృద్ధి పనులకు రూ.40.59 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

జాబ్ మేళాలో 11 మంది ఎంపిక

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 11 మంది ఎంపికైనట్టు జిల్లా జాబ్స్ మేనేజరు కేకవి తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్‌లు సంయుక్తంగా జాబ్ మేళా నిర్వహించగా 32 మంది హాజరయ్యారని చెప్పారు. డక్సన్ ఫైన్ కంపెనీకి ఇద్దరు, శ్రీగోపాల్ ఆటోమోటివ్‌కు నలుగురు, బ్లూ ఓషన్‌కు ఐదుగురు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు చంద్రరాజు, శ్యామ్, ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్ హరిశేష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం



వేట్లపాలెంలో సాగుతున్న స్వామివారి గ్రామోత్సవం

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెంలోని వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. మంగళవారం నుంచి స్వామి వారి కల్యాణోత్సవాలు ఈ నెల ఐదో తేదీ వరకు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఉదయం స్వామి వారిని అమ్మవార్లను వధూవరులుగా తీర్చిదిద్దారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయం నుంచి పురవీధులలో స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు, బ్యాండ్ మేళం, బాణసంచా కాల్పుల మధ్య గ్రామోత్సవం సాగింది. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు, పారిశ్రామిక వేత్తలు గోలి ధర్మారావు, గోలి సోమేశ్వరరావు, వల్లూరి శేఖర్ సేవలందించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

సామర్లకోట: పెద్దాపురం పట్టణ పరిధిలో 8వ నెంబరు రేషన్ షాపులో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు గుర్తించారు. ముందస్తు సమాచారం మేరకు డీఎస్ఓ జి.దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేసి 108 కింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. 6ఏ కేసు నమోదు చేసినట్టు డీఎస్ఓ తెలిపారు. ఆమె వెంట సామర్లకోట, కాకినాడ అర్బన్, కరప ఎంఎస్ఓలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంవిద్-2023



'సంవిద్ 2023'ను ప్రారంభిస్తున్న ఎండీ శ్రీరామసంజీవ్, కమిషనర్ రమేష్ తదితరులు



వేదికలలో విద్యార్థినుల నృత్యరూపకం

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): స్థానిక సూర్యకళామందిర్ ప్రాంగణంలో కాకినాడ సంజీవ్ కాలేజ్ అఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మేనేజ్‌మెంట్, సైన్స్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి అంతర్ కళాశాల సంవిద్–2023 మేనేజ్‌మెంట్, సైన్స్ ఫెస్ట్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంయుక్త కళాశాల ఎండీ పి.శ్రీ రామ సంజీవ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రదర్శించడానికి ఇటువంటి ఈవెంట్లు దోహదపడతాయని అన్నారు. నగర కమిషనర్ కొమ్ము రమేష్, డాక్టర్ రాయుడు త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈవెంట్‌లో సంయుక్త కళాశాల చైర్మన్ పి.ఆనందరాయుడు, డీన్ కె.శ్రీనివాస్, ఏవోపీ శ్రీ పి.వాస్, కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ రవివర్మ, ఈవెంట్ కోఆర్డినేటర్లు టి.కనకలక్ష్మి, డాక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు సేవలు అభినందనీయం



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సత్కరిస్తున్న వైస్ చైర్‌పర్సన్ తదితరులు

సామర్లకోట: శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు సేవలు అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న శ్రీనివాసరావును మంగళవారం సత్కరించారు. వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లే ఆపద మిత్రలు

కాకినాడ: ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు ఆస్తి, ప్రాణ నష్టాలు కలగకుండా తీసుకోవలసిన రక్షణ చర్యలపై 25 మంది వలంటీర్లకు 'ఆపద మిత్ర' పేరుతో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారితో టీపీఆర్‌ఓ ఎమ్ కృష్ణమోహన్ మంగళవారం నగరపాలక సంస్థ పాత భవనంలో సమావేశమయ్యారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా, సమర్ధవంతంగా నిలవాలని వారికి సూచించారు. శిక్షణ పొందిన ప్రతి వలంటీరుకు పదివేల రూపాయలు విలువైన కిట్లను ప్రభుత్వం అందజేసిందన్నారు. ఇందులో లైఫ్ జాకెట్‌తో పాటు ముఖ్యమైన పరికరాలు కూడా ఉన్నాయన్నారు. శిక్షణ వివరాలను, ప్రయోజనాలను మిగిలిన వలంటీర్లకు వివరించి ఆపత్కాలంలో స్పందించేలా కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఆరు బ్యాచ్‌లకు సామర్లకోట శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తయిందన్నారు. టీపీఆర్వో కృష్ణ మోహన్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు.



శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లతో టీపీఆర్వో కృష్ణ మోహన్

గుడివాడ పీఎంపీ బాబ్జీ మృతి



బాబ్జీ (ఫైల్)

పెద్దాపురం: మండలంలోని గుడివాడ, కాండ్రకోట గ్రామాలలో వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ వైద్యుడు మేడపాటి బాబ్జీ (70) మంగళవారం మృతి చెందారు. మండలంలోని కాండ్రకోట, గుడివాడ, సిరివాడ గ్రామాల్లో మంచి వైద్య సేవలు అందిస్తున్న ఆయన విశాఖపట్నంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, గుడివాడ గ్రామ సర్పంచ్ కనకర్తి సీమోహన్, వ్యవసాయ సలహామండలి సభ్యులు వినకొండ వీరవెస్వర్రావు, చవాకుల ఈశ్వర్రావు, శ్రీసత్యకాంతి ప్రార్ధన మందిరం వ్యవస్థాపకులు గంగిన సత్యానందం, సీజీఎం వ్యవస్థాపకులు గంగిన క్యామ్యుల్ సుధీర్, బంధుమిత్రులు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు వెంకన్నకు లక్ష పుష్పాలతో పూజ

సామర్లకోట: వేట్లపాలెంలో కొలువైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారికి 108 మంది దంపతులచే 9 రకాల లక్ష పూలతో పూజ చేయనున్నట్టు ఆలయ కమిటీ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు తెలిపారు. తెల్లవారు జాము గోపూజ ఉంటుందని చెప్పారు. రాత్రి స్వామి వారి కల్యాణం ఉంటుందన్నారు.

రైతులకు అందుబాటులో సేవలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- రైతు భరోసా కేంద్రం ప్రారంభం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన సేవలన్నీ గ్రామాల్లోనే అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గోర్స గ్రామంలో రూ.21లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడమే కాకుండా వ్యవసాయం దండగ అని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు వైఎస్సార్ ప్రభుత్వంలో రైతులకు అందిస్తున్న సేవలను చూసి ఓర్వలేక ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై టీడీపీ, ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారాన్ని ఇప్పటికైనా మానుకోవాలన్నారు. రైతులకు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఎరువులు, పురుగుమందులతో పాటు కావాల్సిన సేవలను అందుబాటులో ఉన్నాయని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రద్దులింద అంటూ మాజీ ఎమ్మెల్యే వర్మ తిరుగుతూ జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మతిస్థిమితం లేని మాటలను మాట్లాడుతున్నారన్నారు. ఎంపీపీ కారే సుద, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ సర్పంచి రొంగల వీరబాబు, ఎంపీటీసీ కొండపల్లి సూర్య నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ స్వాతి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

కొత్తపల్లి: ప్రతిఇంటికీ ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన ఇంటింటికీ కుళాయి కనెక్షన్లకు సంబంధించి వాటర్ ట్యాంకులకు మంగళవారం ఆయన ప్రారంభించారు. కొత్త ఇసుకపల్లి రూ.56.36లక్షలు, పొన్నాడ రూ.24లక్షలు, గోర్స రూ.71.85లక్షలతో జల్‌జీవన్ మిషన్ నిధులతో తాగునీటి ట్యాంకులు, ఇంటి కుళాయి కనెక్షన్ల పనులు జరుగుతున్నాయి.

గత అజెండాలో పనులు ఏమయ్యాయి?

- అధికారుల తీరుపై అధికార పక్ష సభ్యుల ఆగ్రహం
- వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



అధికారుల తీరును తప్పుపడుతున్న వైస్ చైర్మన్, అధికార పక్ష సభ్యులు

సామర్లకోట: మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం వాడీ వేడిగా జరిగింది. జీరో అవర్‌లోను, అజెండాలోని అంశాలపై అధికారులను అధికార పక్ష సభ్యులు నిలదీశారు. గత కౌన్సిల్ ఆమోదించిన పనులు పూర్తి చేయలేదని అధికార పక్ష సభ్యులు ఆవాల లక్ష్మీ నారాయణ, పితాని కృష్ణ, పిట్టా సత్యనారాయణ, నేతల హరిబాబులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి కాని పనులకు బిల్లులు ఎలా చేశారని ఆవాల అసంతృప్తి వ్యక్తం చేశారు. దాంతో వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ కలుగజేసుకుని ఆయా వార్డుల్లో పనులకు మాత్రమే వచ్చే సమావేశంలో బిల్లులు పెట్టాలని సూచిస్తూ ఒకటో అంశాన్ని వాయిదా వేశారు. సింగిల్ టెండర్‌తో పాటు, ఏడాది క్రితం ఆమోదించిన అంశాలకు ఆలస్యంగా టెండర్ పిలవడంపై ఆన్‌లైన్‌లో సింగిల్ టెండర్ మాత్రమే వచ్చిందని ఏఈ వి అరవింద్ తెలిపారు. ఆలస్యంగా పనులు చేసి వెళ్లిపోయిన కాంట్రాక్టర్ల మళ్లీ టెండర్లు పాడుకుంటే ఆ పనులు మధ్యలో నిలిచిపోయే ప్రమాదం ఉందని సభ్యులు చెప్పగా దీనిపై తగు చర్య తీసుకుంటామని కమిషనర్ సంఖా అహ్మద్ హమీర్ ఇచ్చారు. 14వ వార్డులో మొదటగా ప్రారంభమైన గడపగడపకు సంబంధించి విడుదలైన నిధులతో చేయాల్సిన పనులకు టెండర్లు పిలవకుండా తరువాత పనులకు టెండర్లు పిలవడంపై ఆ వార్డు కౌన్సిలర్ స్వయంభూవు వీరభద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య సమస్యపై ఫిల్టర్ ప్లాంటు మరమ్మతులకు ఆమోదించిన పనులు ప్రారంభం కాలేదని సురేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ పరిధిలో పెరిగిపోతున్న చెత్తపైనా, నీలమ్మ చెరువు పనులపైనా సభ్యులు చర్చించారు. సకాలంలో పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి వారిని తొలగించాలని సమావేశం తీర్మానించింది.

డొమెస్టిక్ సిలిండర్ల తనిఖీ



సామర్లకోటలోని ఒక హోటల్ నుంచి డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

సామర్లకోట: పట్టణ పరిధిలో పౌర సరఫరాల విభాగం అధికారులు మంగళవారం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల తనిఖీ చేశారు. గృహావసరాలకు వినియోగించే సిలిండర్లు వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారన్న ఫిర్యాదులపై జిల్లా సివిల్ సప్లయ్ అధికారి జి.దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో హోటళ్లలో సిలిండర్లు తనిఖీ చేశారు. విశ్వేశ్వర థియేటర్ సెంటర్ నుంచి తనిఖీలు ప్రారంభించిన సమయంలో సమాచారం అందుకున్న ఇతర వ్యాపార వర్గాలు జాగ్రత్తపడ్డాయి. మెహర్ కాంప్లెక్స్ నుంచి స్టేషన్ సెంటర్ వరకు తనిఖీ చేసిన అనంతరం, పెద్దాపురంలోను తనిఖీలు చేశారు. వంట గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్న వారిపై 6ఏ కేసులు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఓ టి.ప్రసన్న, ఎంఎస్ఓలు లక్ష్మి రమణి, పి.శ్రీనివాసరావు, మురళీకృష్ణలు పాల్గొన్నారు. కాగా హడావుడిగా కార్లలో వచ్చి తనిఖీలు చేయడంతో వ్యాపార వర్గాలు జాగ్రత్తపడ్డారు దీంతో ఫిర్యాదు చేసినవారి లక్ష్యం ఎలా నెరవేరుతుందని స్థానికులు చర్చించుకున్నారు.

మిగులుతో బడ్జెట్ ఆమోదం

- పిఠాపురం మండల పరిషత్ బడ్జెట్ సమావేశం



సమావేశంలో బడ్జెట్‌ను చదివి వినిపిస్తున్న అధికారిణి

పిఠాపురం: స్థానిక మండల పరిషత్‌కు 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.77500 మిగులుతో రూపొందించిన బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మంగళవారం పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు అధ్యక్షత బడ్జెట్ సమావేశం నిర్వహించారు. అన్ని మార్గాలు, పద్దుల ద్వారా రూ.33.41 కోట్ల ఆదాయం వస్తుందని వివిధ పద్దుల కింద రూ.33.40 కోట్లు వ్యయం అవుతుందని బడ్జెట్‌లో చూపించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీ సభ్యులు మండలంలో తమ తమ గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ కృష్ణవేణి, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.